క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అండ్ ఎంహెచ్ఆర్ఎం విభాగం ఆచార్యులు పి.శ్రీనివాస్‌రావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సెక్రటరీగా బాధ్యతలను నిర్వర్తించిన డాక్టర్ సవితాజ్యోత్స్న నుంచి శ్రీనివాస్‌రావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ యూనివర్సిటీలో క్రీడల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. వివిధ విభాగాల అధ్యాపకులు, కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, వివిధ సంఘాల బాధ్యులు, పరిశోధకులు, తదితరులు పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష్మీనారాయణకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ని ఎకనామిక్స్ విభాగంలో పరిశోధకుడు ఆడెపు లక్ష్మీనారాయణకు యూనివర్సిటీ డాక్టరేట్ ను ప్రకటించింది. గల్ఫ్ మైగ్రేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ రూ రల్ ఎకనామి ది కేస్ ఆఫ్ తెలంగాణ రీజియన్ అంశంపై సమర్పించిన పరిశోధనా త్మక సిద్ధాంత గ్రంథానికి లక్ష్మీనారాయణకు డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి తెలిపారు. ఎకనామిక్స్ విభాగం ఆచార్యులు బి.సురేష్ లాల్ పర్యవేక్షణలో లక్ష్మీనారాయణ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు. లక్ష్మీనారాయణను హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆర్. ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ఎం.ఐలేష్ అభినందించారు.

బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా వెంకట్రాములు



వరంగల్: బిహార్ రాష్ట్రం పాట్నాలో ఈనెల 2 నుండి 5 వరకు జరిగిన భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) జాతీయ 15వ మహాసభలో వరంగల్‌కు చెందిన తాటిపాముల వెంకట్రాములు జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నాల్గోసారి ఎన్నికయ్యాడు. విద్యార్థి, యువజన రంగాల్లో వివిధ బాధ్యతలను నిర్వహించిన వెంకట్రాములు సీపీఐ వరంగల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధానకార్యదర్శిగా బాధ్యతలను ఎంతో సమర్థవంతంగా నిర్వహించారు. వెంకట్రాములు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మహాసభలో చర్చించి వాటి సాధనకు పోరాట కార్యక్రమాన్ని రూపొందించడం జరిగిందన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన



ఖిలా వరంగల్: ఈనెల 30 జరుగనున్న ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వరంగల్ శంభునిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్స్‌పాల్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్వీప్ నోడల్ ఆఫీసర్ నరసింహమూర్తి హాజరై ఓటు వేస్తాను కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వాల్యానాయక్, అధ్యాపకులు శ్రీనివాస్‌రెడ్డి, రుద్రాణి, అంబాసిడర్ రంజిత్, సాయి పాల్గొన్నారు

బీసీ గర్జనకు తరలిన నేతలు



కాజీపేట: మండల కేంద్రం నుంచి పీఎం నరేంద్రమోదీ బీసీ గర్జన మహాసభకు బీజేపీ కార్యకర్తలు మంగళవారం భారీగా తరలివెళ్లారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్ గౌడ్ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. దాదాపు వందమంది కార్యకర్తలు పశ్చిమ అభ్యర్థి రావు పద్మతో సభకు హాజరయ్యారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 8న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ శెంకేసి మల్లికార్జున్ తెలిపారు. శాంతినగర్, కరీమాబాద్ రోడ్, రామాలయం, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

‘సాక్షి మ్యాథ్స్‌బీ’కి విశేష స్పందన

హసన్‌పర్తి : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ‘సాక్షి’ ఆధ్వర్యంలో మంగళవారం మ్యాథ్స్ బీ ప్రాథమిక స్థాయి పరీక్ష నగరంలోని స్కై ఇంటర్నేషనల్ స్కూల్, తాళ్లపద్మావతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్, లర్నస్‌ల్యాండ్ హైస్కూల్, రామన్ హైస్కూల్, షైన్ హైస్కూల్, క్రియేటివ్ హైస్కూల్, సాయి ట్యూటోరియల్స్, వండర్ కిడ్స్ తో పాటు వివిధ పాఠశాలల్లో మంగళవారం ఈ పరీక్ష నిర్వహించారు. పరీక్షకు ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వరంగల్ ‘సాక్షి’ బ్రాంచ్ మేనేజర్ వి.శ్రీనివాస్ మాట్లాడుతూ ‘సాక్షి’ నిర్వహిస్తున్న మ్యాథ్స్ బీ పోటీ పరీక్షతో విద్యార్థులకు గణితంపై పట్టు పెరుగుతోందన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభ పాటవాలను వెలికితీయడంలో ‘సాక్షి’ ఎప్పుడు ముందంజలో ఉంటుందని శ్రీనివాస్ తెలిపారు. ఇలాంటి పోటీ పరీక్షల్లో పాల్గొనడానికి ఆసక్తి గల విద్యార్థులు ఫోన్ నంబర్ 9505514424 సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో సాక్షి బ్యూరో ఇన్‌చార్జ్ గడ్డం రాజిరెడ్డి, ఎడిషన్ ఇన్‌చార్జ్ లింగయ్య, ఈవెంట్స్ మేనేజర్ ఎస్.సుమన్ గుప్తా, సాక్షి బృందం పాల్గొంది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు.



సాక్షి మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న రామన్ హై స్కూల్ విద్యార్థులు



భీమారంలోని స్కై హైస్కూల్‌లో సాక్షి మ్యాథ్స్ బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

‘సాక్షి’ మ్యాథ్స్‌బీ తో విజ్ఞానం పెరుగుతోంది



సాక్షి మ్యాథ్స్ బీ నిర్వహించిన పోటీ పరీక్షలతో విజ్ఞానం పెరుగుతోంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షలపై అవగాహన కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ‘సాక్షి’ ఆధ్వర్యంలో ఇలాంటి పరీక్షలు మరిన్ని నిర్వహించాలి.

- టి. హాసిని, 8వ తరగతి (క్రియేటివ్ స్కూల్)

సమయం ఆదా



పోటీ పరీక్షల్లో సమయం ఎలా ఆదా చేసుకోవాలో తెలిసింది. భవిష్యత్‌లో రాసే పోటీ పరీక్షల్లో తక్కువ సమయంలో ఎక్కువ సమాధానాలు సాక్షి మ్యాథ్స్ బీ ద్వారా తెలుసుకున్నా.

- డి.ప్రద్వీక్, 7 తరగతి (శ్రీసాయి ట్యూటోరియల్స్)

మ్యాథ్స్‌బీ పై అవగాహన



మ్యాథ్స్‌బీ పోటీ పరీక్షలతో గణితంపై అవగాహన కలిగింది. పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల భయం అనేది లేకుండా పోతోంది. భవిష్యత్‌లో పోటీ పరీక్షలు దోహదపడుతాయి.

- మహేర సమీనా, 4వ తరగతి (లర్నస్ ల్యాండ్ హైస్కూల్)

ప్రతి అంశంపై పట్టు



సాక్షి మ్యాథ్ బీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల సరికొత్త విషయాలు తెలుసుకోగలిగా. ప్రతి అంశంపై పట్టు సాధించా. భవిష్యత్‌లో ఉన్నత చదువులకు, పోటీ పరీక్షలకు మ్యాథ్ బీ ఎంత గానో దోహదపడుతోంది.

- సీహెచ్.దీక్షిత, 9వ తరగతి (తాళ్ల పద్మావతి స్కూల్)

ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగకరం



ఇలాంటి పరీక్షలు ఉన్నత చదువులకు ఎంతో దోహదపడుతాయి. భవిష్యత్‌లో గణితవిద్యకు ఇది ఒక వారధిగా, సులువుగా ఉపయోగపడుతుంది.

- పి. మన్విత్ సాయి, 5వ తరగతి (షైన్ స్కూల్)

ప్రాథమిక విద్యలోనే పరీక్ష రాయడం సంతోషం



ప్రాథమిక విద్యలోనే పోటీ పరీక్షల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. పరీక్ష రాయడానికి కష్టపడి చదివా. ‘సాక్షి’ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతి పోటీ పరీక్షల్లో పాల్గొంటా.

- కె. నిధి, 4వ తరగతి (వండర్ కిడ్స్ స్కూల్)

వీల్ అలైన్మెంట్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



చిరంజీవి, అధ్యక్షుడు

నయీంనగర్ : వరంగల్, హనుమకొండ జిల్లాల వీల్ అలైన్మెంట్ అసోసియేషన్ షాప్ యజమానుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తండా చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా శశికళాధర్, కోశాధికారిగా భూపతిరెడ్డి, బాధ్యులుగా అఖిల్, అన్వర్, సంపత్, అడ్వైజరీ కమిటీ సభ్యులుగా ప్రవీణ్, అనిల్, బషీర్, సాజిద్, నరసింహా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న రేట్లు తగ్గించుకోకుండా తీసుకోవాలని, నెలకు రూ.2 వేలతో చిట్టీ ప్రారంభించాలని, సభ్యులను ఆర్థికంగా ఆదుకోవాలని తీర్మానించారు.

బీఆర్ఎస్వీ నూతన కమిటీ

బీఆర్ఎస్వీ కోఆర్డినేటర్ బైరపాక ప్రశాంత్ ఆధ్వర్యంలో నగరంలోని 6వ డివిజన్ నూతన ఇన్‌చార్జ్‌గా మసూద్ పాషా సయ్యద్, ప్రెసిడెంట్‌గా హరీష్‌తో పాటు కార్యవర్గ సభ్యులను నియమించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నం మధు, పార్టీ సీనియర్ నాయకులు కపిలవాయి రాంబాబు, పస్తం అనిల్, పిట్టల కల్యాణ్, యూత్, డివిజన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం నీటి సరఫరా చేయాలి

హసన్‌పర్తి: గ్రామాల్లో నిరంతరం తాగునీటి సరఫరా చేయాలని ఈఈ రామాంజనేయులు సూచించారు. మండలంలోని సీతంపేట, గంటూరుపల్లి, పెంబర్తి గ్రామాల్లో నీటి సరఫరా తీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో అక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

- సమావేశాలకు, ర్యాలీలకు అనుమతి తప్పనిసరి
- నిబంధనలు ఉల్లంఘిస్తే 1950 నంబర్‌కు ఫిర్యాదు చేయండి
- వరంగల్ ఏసీపీ బోనాల కిషన్

రామన్నపేట/వరంగల్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ అమల్లో ఉన్నందున రోడ్లపైన, పబ్లిక్ ప్రదేశాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా ఐదుగురు అంతకుమించి గుమిగూడి ఉన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ అన్నారు. మంగళవారం వరంగల్ ఏసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ర్యాలీలు, సమావేశాలు, ఇంటింటి ప్రచారాలు చేసుకోవడానికి ప్రచార రథాలు తిప్పడానికి తప్పనిసరిగా రిటర్నింగ్ అధికారి అనుమతి తప్పనిసరి స్పష్టం చేశారు. ప్రైవేట్ శుభకార్యాలు, బర్త్‌డే పార్టీలు, ఆత్మీయ సమ్మేళనాలు, కుల, వనభోజనాలకు వెళ్లినప్పుడు పార్టీలకు సంబంధించిన కండువాలు ధరించడం ఓట్లను అభ్యర్థించడం, ఓటర్లను ప్రభావితం వంటివి పాల్పడకూడదని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడితే కార్యక్రమ నిర్వాహకులపై కేసు న మోదు చేస్తామని తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంట ల వరకు ఎన్నికల ప్రచారం చేయవద్దని, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు దేవాలయాల్లో, చర్చిల్లో, మసీదుల్లో, ప్రార్థన మందిరాల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం నిషేధమన్నారు. ప్రైవేట్ ఫంక్షన్ హాల్స్‌లో అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తే ఆ అభ్యర్థులపైనా, ఫంక్షన్ హా ల్ యజమానులపైనా కేసులు నమోదు చేస్తామన్నా రు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే 1950, పో లీసు టోల్ ఫ్రీ నంబర్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు.



మాట్లాడుతున్న ఏసీపీ కిషన్

చపాతి తయారీ కేంద్రం ప్రారంభం



కాజీపేట: స్థానిక స్వయంభు శ్రీశ్వేతార్కమూలగణపతి దివ్యక్షేత్రంలోని అన్నపూర్ణ భవనంలో మంగళవారం చపాతి రోటీ మేకర్‌ను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ ప్రారంభించారు. 63వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్‌తో కలిసి భక్తుల అవసరాలకు సరిపడా చపాతిలను తయారు చేయడం కోసం మిషన్‌ను దాతలు అందజేశారు. కార్యక్రమంలో భద్రకాళి దేవస్థాన ఆస్థాన పండితులు అనంతమల్లయ్య శర్మ, రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన టీడీపీ నేతలు



రామన్నపేట : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కాసుల సురేష్–లావణ్య దంపతులు మంగళవారం మాజీ మంత్రి కొండా సురేఖ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా సురేశ్‌బాబు మాట్లాడుతూ టీడీపీని వీడుతున్నందుకు బాధగా ఉన్నా ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో టీడీపీ పోటీ విరమించుకున్న నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు నల్గొండ రమేష్, బొల్లం శివ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయరాంచందర్ కాంగ్రెస్‌లో చేరిక

ఖిలా వరంగల్: వరంగల్ 34వ డివిజన్ శివనగర్‌కు చెందిన విజయరాంచందర్ మంగళవారం మాజీ కార్పొరేటర్ శామంతుల ఉషశ్రీపద్మ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆమెకు మాజీ మంత్రి కొండా సురేఖ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని యువకుడి మృతి

కాశిబుగ్గ : రైలు నుంచి ప్రమాదవశాత్తు గుర్తుతెలియని యువకుడు జారి పడి మృతి చెందిన ఘటన వరంగల్–చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య వంచనగిరి రైల్వేగేట్ సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ కథనం ప్రకారం.. మృతుడు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు, 5.6 ఎత్తు చామనఛాయ రంగు, నల్లని తలవెంట్రుకలు, గడ్డం మీసాలు కలిగి వైట్‌కలర్ జీన్స్ ప్యాంట్, బ్రౌన్ అండ్ బ్లూ కలర్ చెక్స్ ఫుల్‌షర్టు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభించకపోవడంతో మృతదేహన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరచామని సీఐ తెలిపారు. వివరాలు తెలిస్తే వరంగల్ రైల్వే స్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలి

విద్యారణ్యపురి: విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకొని తద్వారా శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవడం తద్వారా జ్ఞానసమాజం నిర్మాణం అవుతుందన్నారు నిట్ ప్రొఫెసర్ ఎ.రామచంద్రయ్య అన్నారు. మంగళవారం హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన వైజ్ఞానిక సదస్సులో ‘ప్రగతికి తొలి మెట్టు ప్రశ్న’ అని నినదించే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సీవీ రామన్ జయంతి నవంబర్ 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ‘జాతీయ శాస్త్రీయ దృక్పథ ప్రచార ఉద్యమం’లో భాగంగా జాతీయ శాస్త్రీయ దృక్పథ ప్రచార ఉద్యమం ప్రారంభమైంది. ప్రగతికి తొలి మెట్టు ప్రశ్న అని ఎవరైతే ప్రతిదానిని గుడ్డిగా నమ్మకుండా ప్రశ్నిస్తూ పలు విషయాలను తెలుసుకుంటారో వారే ప్రగతి పథంలో పయనిస్తారన్నారు. సమన్వయకర్తగా ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ బి.రమేష్ వ్యవహరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి పరికిపండ్ల వేణు, అధ్యాపకులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామచంద్రయ్య

విద్యతోపాటు సంస్కారాన్ని అలవర్చుకోవాలి

హసన్‌పర్తి : విద్యతో పాటు చక్కటి సంస్కారాన్ని అలవర్చుకోవాలని సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ‘సంస్కార వికాస శిక్షణ’అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు. సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ సాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండి మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం బోధనలు అనుసరించి ఎదగాలని సూచించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు కజాంపురం దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతంగా ఆలోచించడం అలవర్చుకున్నట్లయితే ఉన్నతంగా ఎదుగుతారన్నారు. ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు కుమారస్వామి, సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, రిటైర్డ్ ఇంజనీర్ రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సయ్య

ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ రామన్



హన్మకొండ : సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

హన్మకొండ: ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త సీవీ రామన్ అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ హనుమాన్‌నగర్–1లో భారతరత్న, నోబెల్ అవార్డు గ్రహీత సీవీ రామన్ 123వ జయంతిని జరుపుకున్నారు. ముందుగా సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ సీవీ రామన్ అనేక పరిశోధనలు చేశారన్నారు. కార్యక్రమంలో మొట్ల మనోహర్, కుమార్‌రెడ్డి, సిరిమల్లె ప్రవీణ్, చిర్ర శ్రవణ్, శ్రీనివాస్, రాజ్ కుమార్, వెంకటేష్, రవికిరణ్, వినోద్, దేవేందర్, రాజేశ్, సురేష్ పాల్గొన్నారు.



కాజీపేట అర్బన్ : మాట్లాడుతున్న పురుషోత్తం

సీవీ రామన్ స్ఫూర్తితో రాణించాలి

కాజీపేట అర్బన్ : సీవీ.రామన్ స్ఫూర్తితో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా రాణించాలని జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు కె.పురుషోత్తం అన్నారు. మండలంలోని కడిపికొండ జెడ్పీహెచ్ఎస్‌లో మంగళవారం నిర్వహించిన సీవీరామన్ జయంతి వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా పురుషోత్తం హాజరై సీవీ.రామన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోజ్‌కుమార్, రాజగోపాల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోషల్ సైన్స్‌డీన్ డాక్టర్ మనోహర్

కేయూ క్యాంపస్ : ఈనెల 11న హైదరాబాద్‌లో జరగబోయే మాదిగల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని కాకతీయ యూనివర్సిటీ సోషల్ సైన్స్‌డీన్ ఆచార్యులు టి.మనోహర్ పిలుపునిచ్చారు. మంగళవారం యూనివర్సిటీలో మానవీయ శాస్త్ర భవనం సెమినార్ హాల్లో మాదిగ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనర్ సంకినేని వెంకట్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ లేకపోవడం వలన మాదిగ మాదిగ ఉపకులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. మహాసభకు ప్రొఫెసర్లు, మేధావులు మాదిగ ఉద్యోగస్తులు, విద్యార్థులు వర్గీకరణకు న్యాయబద్ధమైన పోరాటానికి సంఘీభావం ప్రకటిస్తూ ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు బొడ్డు దయాకర్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.తిరుపతి మాదిగ, బాధ్యులు డాక్టర్ వడ్డేపల్లి మధుకర్‌మాదిగ, డాక్టర్ మంద వీరస్వామి, ప్రొఫెసర్ కనకరత్నం అధ్యాపకులు డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, శ్రీనివాస్, సత్యం, రవీందర్, సుధాకర్ రమేష్, బిక్షపతి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేయూలో మరో కొండచిలువ సంచారం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో సోమవారం రాత్రి ఫార్మసీ హాస్టల్ సమీపంలో మరో కొండచిలువ సంచరిస్తుండగా పలువురు విద్యార్థులు చూశారు. క్యాంపస్‌లోని వివిధ విభాగాల సమీపంలోని చెట్ల పొదల్లో కూడా పలు కొండచిలువలు సంచరిస్తున్నాయి. దీంతో రాత్రివేళ వివిధ చోట్లకు సంచరిస్తుండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే క్యాంపస్‌లోని ఫార్మసీ కళాశాల–జియాలజీ విభాగం మధ్యలో, శిథిలావస్థకు చేరి మూతపడిన ప్రతాపరుద్ర హాస్టల్ పరిసర ప్రాంతాల్లో కొండచిలువలు సంచరిస్తున్నాయని సమాచారం. అటవీశాఖాధికారులు చొరవ తీసుకొని క్యాంపస్‌లో సంచరిస్తున్న పలు కొండచిలువలు పట్టుకొని తీసుకెళ్లి అటవీ ప్రాంతాల్లో వదిలివేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ఆ దిశగా యూనివర్సిటీ అధికారులు కూడా చర్యలు చేపట్టాలని కేయూ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య కోరారు.



ఫార్మసీ హాస్టల్ వద్ద సంచరిస్తున్న కొండ చిలువ

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడి

ఖిలా వరంగల్ : అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి రూ.2810 విలువ గల మద్యం సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. శంభునిపేట–దూపకుంట రోడ్డులో బూర శ్రీనివాస్, ఎండీ.గౌసియా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం టాస్క్‌ఫోర్స్ అధికారులకు అందింది. విశ్వసనీయ సమాచారం, ఏసీపీ ఆదేశాల మేరకు మంగళవారం బెల్ట్‌షాపులపై దాడులు చేసి అక్రమ నిల్వ చేసిన రూ.2,810 విలువ గల మద్యం స్వాధీనపర్చుకుని, ఇద్దరి నిందితులపై కేసు నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్ గౌడ్‌కు కేసును అప్పగించినట్లు సీఐ రాంబాబు, బి.శరత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్సైలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లోకల్ కోర్టులతో సమస్యలు పరిష్కారం

హన్మకొండ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఎన్.వీ.వేణుగోపాలచారి తెలిపారు. వినియోగదారులకు సౌకర్యంగా ఉండేలా వారి ముంగిటికి వచ్చి లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందన్నారు. ఈ నెల 8న హనుమకొండ రూరల్ డివిజన్ పంథిని సబ్‌స్టేషన్‌లో లోకల్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ధర్మసాగర్, ఐనవోలు, పంథిని సెక్షన్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు వారి సమస్యలు లోకల్ కోర్టు దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈనెల 15న వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలోని గొర్రెకుంట సబ్ స్టేషన్లలో జరిగే లోకల్ కోర్టులో వరంగల్ స్టేషన్ రోడ్డు, అజాంజాహిమిల్, ఖిలావరంగల్, గొర్రెకుంట సెక్షన్ పరిధిలోని వినియోగదారులు సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్ల ప్రతిభ



కేయూ క్యాంపస్ : హైదరాబాద్‌లో అక్టోబర్ 27 నుంచి ఈనెల 5 వరకు నిర్వహించిన ఎన్‌సీసీ ఇంటర్ గ్రూప్ పోటీల్లో సంస్కృతిక విభాగంలో వరంగల్ గ్రూప్ ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొని ఓవరాల్ చాంపియన్ షిప్‌ను సాధించారన్నారు. అందులో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు 19 మంది ప్రతిభ కనపర్చి మొదటి స్థానం సాధించారని ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య తెలిపారు. మంగళవారం ఉదయం ఆ కళాశాలలో వీసీ రమేష్ ఎన్‌సీసీ విద్యార్థులను అభినందించారు.